

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ముసునూరు


వసతిగృహాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

మండల కేంద్రమైన ముసునూరులో బాలుర, బాలికల హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు డిమాండ్ చేశారు. ఆయన ఆ హాస్టళ్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల వసతిగృహంలో కాంపౌండ్ వాల్ తక్కువగా ఉందన్నారు. బాలుర వసతిగృహంలో స్లాబ్ పెచ్చులు ఊడిపోయి, నీరు చెమ్మ వచ్చి అసౌకర్యంగా ఉందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీను, కంచర్ల రమేష్, కంచర్ల ప్రసాద్, పాల్గొన్నారు.

ఎరువులకు.. ఓటిపినా..?

- రబీలో కొత్త ప్రయోగానికి ప్రభుత్వం కసరత్తు
- వెబ్‌ల్యాండ్ ఆధారంగా ఎరువుల పంపిణీకి ఆలోచన
- వెబ్‌ల్యాండ్‌లో ఫోన్ నెంబర్లన్నీ భూ యజమానులవే
- ఓటిపి భూ యజమానికి వెళ్తే కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరమే
- రెండు జిల్లాల్లో రబీలో 3.25 లక్షల ఎకరాల్లో వరిసాగు
- ఏలూరు, పశ్చిమలో మొత్తం లక్షా 90 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీలో వెబ్‌ల్యాండ్ ఆధారంగా ఎరువుల పంపిణీ చేపట్టి ఓటిపి (వన్‌టైం పాస్‌వర్డ్) తప్పనిసరి చేసే కౌలు రైతుల కష్టాలు వర్ణనాతీతంగా మారే ప్రమాదం కనిపిస్తోంది. వెబ్‌ల్యాండ్‌లో భూ యజమానుల ఫోన్ నెంబర్లే ఉన్నాయి, ఓటిపి భూ యజమానులకు వెళితే సహకరించే పరిస్థితి ఉండని కౌలు రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కౌలురైతులకు ఇబ్బంది లేకుండా ఎరువుల పంపిణీ జరిగేవిధంగా ఆలోచన చేయాలని అంతా కోరుతున్నారు. ఖరీఫ్‌లో యూరియా సమస్య ప్రభుత్వాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. యూరియా అవసరం లేకపోయినా రైతులు పట్టుకెళ్లడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయన్నట్లు చర్చ సాగింది. దీంతో రబీలో అటువంటి పరిస్థితి రాకుండా వెబ్‌ల్యాండ్ (ఇ-పంట)



ఆధారంగా ఎరువులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎరువులు కావాల్సిన రైతులు సొసైటీకి వెళ్లి భూములకు సంబంధించిన వివరాలను దుకాణం వద్దకు తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఆ వివరాలను వెబ్‌ల్యాండ్‌లో పరిశీలించి మూడు విడతలుగా ఎంత అవసరమో అంతవరకూ ఎరువులు ఇస్తారని చెబుతున్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయగానే వెబ్ ల్యాండ్‌లో ఎవరు పేరున భూమి ఉంటుందో వారి ఫోన్ నెంబర్‌కు ఓటిపి వెళ్తోంది. ఆ ఓటిపి నెంబర్ చెబితేనే ఎరువులు ఇవ్వడం జరుగుతోంది. ఈ విధానం అమల్లోకి వస్తే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో తీవ్ర ఇబ్బందిగా మారే పరిస్థితి ఏర్పడనుంది. రబీలో ఏలూరు జిల్లాలో 95 వేల ఎకరాల్లో వరిసాగు జరగనుండగా, పశ్చిమలో 2.25 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టనున్నారు. రెండు జిల్లాల్లో 80 శాతం సాగు కౌలు రైతులే చేస్తున్నట్లు అధికారిక లెక్కలు సైతం చెబుతున్నాయి. రబీలో యూరియా 54 వేల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఇతర ఎరువులు కలిపి మొత్తంగా లక్షా ఐదు వేల మెట్రిక్ టన్నుల అవసరం పడుతుందని వ్యవసాయాధికారులు ప్రణాళికలు రూపొందించారు. పశ్చిమలో యూరియా 36 వేల మెట్రిక్ టన్నులు అవసరం అవుతుందని, కాంప్లెక్స్, ఇతర ఎరువులు కలిపి మొత్తంగా 86 వేల మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరం కానున్నట్లు ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. ఇప్పటివరకూ కౌలురైతులు నేరుగా వెళ్లి ఆధార్‌కార్డు చూపించి ఎరువులు తీసుకుంటున్నారు. రబీ నుంచి ఆ పరిస్థితి మారనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఓటిపి లింకు పెడితే తీవ్ర ఇబ్బందులు

వెబ్‌ల్యాండ్‌లో భూ యజమానుల పేర్లు తప్ప కౌలు రైతుల పేర్లు నమోదు కావడం లేదు. ఒకవేళ ఎక్కడైనా చేసినా అది నామ మాత్రమే. రబీలో ఎరువుల కోసం కౌలురైతు వెళితే వెబ్‌ల్యాండ్‌లో భూ యజమాని ఫోన్ నెంబర్ ఉంటుంది. దీంతో ఓటిపి భూ యజమాని నెంబర్‌కు వెళ్తోంది. చాలా మంది భూ యజమానులు ఇతర పట్టణాలకు వెళ్లి వ్యాపారాలు చేసుకుంటున్నారు. కొంతమంది ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల్లోనూ ఉన్నారు. భూ యజమానికి ఓటిపి వెళితే తిరిగి ఫోన్ చేసి ఆ నెంబర్ చెప్పే పరిస్థితి ఏమాత్రమూ ఉండదు. కొంతమంది ఫోన్లు ఎత్తే అవకాశం సైతం ఉండదు. అటువంటప్పుడు కౌలురైతులకు ఎరువులు ఏవిధంగా అందిస్తారన్న ప్రశ్న అందరినీ వేధిస్తోంది. వెబ్‌ల్యాండ్‌లో కౌలురైతుల ఫోన్‌నెంబర్లు నమోదు జరిగితేనే ఓటిపి వ్యవహారం ముందుకు సాగుతోంది. లేకపోతే ఎరువుల కోసం కాళ్లరిగేలా తిరగాల్సిందే. ఇది ప్రభుత్వానికి మరింత చెడ్డపేరు తెచ్చే అవకాశం ఉంటుంది. 'పొయ్యిలోంచి పెనంపైన పడిన' చందంగా ప్రభుత్వం పరిస్థితి మారుతోంది. ఎరువుల పంపిణీకి ఓటిపి లింకు పెట్టడం తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కౌలు రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువుల పంపిణీ జరగాలన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. లేకపోతే కౌలురైతులు రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడనుందనడంలో ఎటువంటి సందేహం అక్కర్లేదు. శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ జరగనుంది. ఈ సమావేశంలో ఎరువుల పంపిణీపై ప్రభుత్వం ఏ విధానాన్ని ప్రకటిస్తుందోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది.

జిఎస్‌టితో పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట

వాహన ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ వెట్రిసెల్వి, జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు


ర్యాలీ ప్రారంభించిన కలెక్టర్ వెట్రిసెల్వి, జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

జిఎస్‌టి సంస్కరణలతో నిరుపేద, మధ్యతరగతి, ధనిక కుటుంబాలతో సహా అందరికీ ఎంతో మేలు కలిగిందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. స్థానిక శాంతినగర్ నుంచి గురువారం జిల్లా ట్రాన్స్ పోర్టు కార్యాలయం ఆధ్వర్యంలో పోలీసు పెట్రోల్ బంకు నుంచి పాత బస్టాండ్ వరకూ ఆటోలు, మాక్సీ క్యాబ్‌లు, మోటార్ క్యాబ్‌లు, చిన్న కార్లతో ర్యాలీని కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిఎస్‌టిపై అందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా, పట్టణాల నుంచి గ్రామాల వరకూ ప్రతి రోజూ ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈ రోజు వాహనాల ర్యాలీని ప్రారంభించామని తెలిపారు. ఆర్థిక మాంద్యం నెలకొన్న తరుణంలో జిఎస్‌టి నాలుగు స్లాబులను రెండుకు కుదించి, కొన్ని వస్తువులపై జిఎస్‌టి తగ్గించడం, కొన్నింటిపై రద్దు చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా కిరాణా సామగ్రిపై గతంలో 18 శాతం, 12 శాతం, 5 శాతం జిఎస్‌టి ఉండేదని, ఇప్పుడు కొన్నింటిపై 5 శాతం, కొన్నింటిపై జీరో శాతం చేసినట్లు తెలిపారు. పిల్లలు వాడుకునే పెన్నులు, పెన్సిళ్లు, ఎరేంజర్స్ వంటివాటిపై టాక్స్ లేదన్నారు. కొబ్బరి నూనె, టాల్కమ్ పౌడర్ వంటివాటిపై టాక్స్ తగ్గించారని తెలిపారు. జెడ్‌పి ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ ప్రధాని మోడీ తీసుకొచ్చిన జిఎస్‌టి 2.0 సంస్కరణలను మొట్టమొదటి సరిగా మద్దతు తెలిపిన ఘనత రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వమేనని అన్నారు. కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాలకు లబ్ది చేకూర్చేలా ప్రారంభించిన సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లి జిఎస్‌టి ఫలాలు అందరికీ అందేలా అంతా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నాగార్జునరావు, ఏలూరు నగరపాలక కమిషనరు ఎ.భానుప్రతాప్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనరు జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల

వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మధ్యాహ్న భోజన కార్మికులకు మూడు నెలల వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని ఏపి మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం జిల్లా అధ్యక్షులు చంద్రకళ, కార్యదర్శి ఎం.నాగమణి ఒక ప్రకటన విడుదల చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో జిల్లాలో 3,200 మంది కార్మికులు పనిచేస్తున్నారనీ, మూడు నెలల నుంచి కార్మికులకు వేతనం గానీ, బిల్లులు గానీ ప్రభుత్వం చెల్లించలేదని తెలిపారు. ఈ పథకంలో ఎక్కువ మంది బడుగు బలహీన, మధ్య తరగతి మహిళలు పనిచేస్తున్నారని, కిరాణా షాపుల వద్దకు వెళ్తే అరువు ఇవ్వం పొండి అంటున్నారని, ఇప్పటికే కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారనీ, కార్మికుల కుటుంబాలు నడవడం చాలా ఇబ్బందికరంగా మారిందనీ తెలిపారు. ఇప్పటికే మహిళలు ఉన్న బంగారాన్ని కూడా అమ్ముకొని పిల్లలకు వేడివేడిగా మధ్యాహ్న బడి భోజనం వండి పెడుతున్నారని, ప్రభుత్వం మాత్రం వీరికి వేతనాలు చెల్లించకుండా కాలయాపన చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ కేటాయించాలని, కార్మికులకు నెలనెలా 5వ తేదీలోపు వేతనం చెల్లించాలని, గుర్తింపు కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


నెలాఖరులోగా హాస్టళ్లలో

టాయిలెట్ల నిర్మాణం పూర్తిచేయాలి

అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా చేపట్టాల్సిన టాయిలెట్స్ నిర్మాణాలు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశం హాల్లో గురువారం జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు, టాయిలెట్లు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రభుత్వ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, గురుకుల వసతి గృహాల్లో తాగునీటిని పరీక్షించి, కలుషిత నీరు సరఫరా అయ్యే చోట ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, మంజూరైన టాయిలెట్లను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలోని 52 ప్రభుత్వ వసతి గృహాలకు మరమ్మతు పనులు చేపట్టేందుకు రూ.5.73 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వాటిని కూడా నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. పూర్తి చేసిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల కోసం ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. సచివాలయాల వద్ద నిర్మించే కమ్యూనిటీ టాయిలెట్ కాంప్లెక్స్‌లను వెంటనే పూర్తిచేయాలన్నారు. వసతి గృహాల్లో దోమల సమస్య పరిష్కారానికి దోమ తెరలు అందించాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థుల భద్రతకు సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాటిని దగ్గరలోని పోలీస్ స్టేషన్లలో పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో 390 టాయిలెట్లు మంజూరు కాగా, వాటిలో 313 టాయిలెట్లు పూర్తిచేశారని, మిగిలినవి ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ద్వారకాతిరుమలలో పారిశుధ్య పరిస్థితులు పూర్తిస్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ద్వారకాతిరుమలలో పర్యాటకుల ఉపయోగార్థం పబ్లిక్ ప్రదేశాలలో అవసరమైన టాయిలెట్ల నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలు సాధించిన అధికారులను అభినందిస్తానని, అదే సమయంలో లక్ష్యసాధనలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటానని


మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

కలెక్టర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా నిర్దేశించిన సమయంలో లక్ష్యాలను పూర్తిచేసిన భీమడోలు ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇని కలెక్టర్ అభినందించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ విశ్వమోహన్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ త్రినాధబాబు, ఐసిడిఎస్ పీడీ శారద, సిపిఒ వాసుదేవరావు, సమగ్రశిక్ష ఎపిసి పంకజ్ కుమార్, పర్యాటకాభివృద్ధి అధికారి పట్టాభి రామయ్య, వివిధ శాఖ అధికారులు, ప్రభృతులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి వైద్యులకు ఆశావర్కర్ల మద్దతు

ప్రజాశక్తి - భీమడోలు

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లోని పిహెచ్‌సిల్లో పనిచేస్తున్న డాక్టర్లు గత తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పది రోజులకు పైగా సమ్మె చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్య వైఖరితో ఉంది. డాక్టర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారు చేస్తున్న సమ్మెకు సంఘీభావంగా ఆశావర్కర్లు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. భీమడోలు మండలం గుండుగొలనులో ఆశా కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా


భీమడోలులో..

యూనియన్ నాయకురాలు నయోమి పద్మ, తదితరులు మాట్లాడారు. వైద్యుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ద్వారకాతిరుమల : మండలంలోని సిహెచ్.పోతేపల్లి గ్రామంలోని పిహెచ్‌సి వద్ద ఆశా కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా


నూజివీడులో....

ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి, మండల నాయకురాలు లలిత, తదితరులు మాట్లాడారు. సకాలంలో ప్రమోషన్లు ఇవ్వాలని, ఇన్‌సర్వీస్ పీజీ కోట పునరుద్ధరణ చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, గిరిజన ప్రాంతంలో సేవలు అందిస్తున్న వైద్యులకు 50 శాతం మూలవేతనం ప్రత్యేకంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ముసునూరు : పిహెచ్‌సి వైద్యులకు ఆశావర్కర్లు మద్దతు తెలుపుతూ ముసునూరు, రమణక్కపేట పిహెచ్‌సిల వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ మండల నాయకులు మద్దాల సునీత, రజిని, శకుంతల, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని బంగినపల్లితోటలో ఉన్న అర్బన్ హెల్త్ ప్రైమరీ సెంటర్‌లో నిరసన కార్యక్రమానికి ఆశావర్కర్లు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి.కమల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాగమణి, కుమారి, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

యువతకు ప్రత్యేక డిజిటల్ ప్లాట్‌ఫాం ప్రారంభం


నూజివీడు టౌన్: నూజివీడు సబ్ డివిజన్ పరిధిలోని యువతీ యువకులకు తమ సృజనాత్మకత, డిజిటల్ నైపుణ్యాలు, సామాజిక బాధ్యతను ప్రదర్శించడానికి FROM NUZVID WE LEAD అనే ప్రత్యేక డిజిటల్ ప్లాట్‌ఫాం ప్రారంభించినట్లు నూజివీడు సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న చెప్పారు. ఈ ప్లాట్‌ఫాం ద్వారా యువత ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవలు, విజయాలను ప్రజలకు చేరవేయడానికి అవకాశం లభిస్తుందన్నారు. ఈ డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్స్, డిజిటల్ మీడియా, కంటెంట్ క్రియేషన్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్, వీడియో ఫొటో డాక్యుమెంటేషన్ల ద్వారా, ప్రభుత్వంతో పాటు నూజివీడు అభివృద్ధిలో భాగస్వాములు అవ్వొచ్చన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 17వ తేదీ ఉదయం 10:30 గంటలకు నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యువతకు డిజిటల్ కమ్యూనికేషన్, సోషల్ మీడియా అవుట్‌రీచ్, సృజనాత్మక, ఆలోచనలు, సమాజంపై సానుకూల ప్రభావం చూపే మార్గాలు గురించి చర్చించడానికి, తమ ప్రతిభను ప్రదర్శించడానికి అవకాశం లభిస్తుందన్నారు. ఈ వేదిక ద్వారా నూజివీడు డివిజన్ పరిధిలోని సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్స్, యువత కూడా నూజివీడు అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూ, ప్రజలకు వారి సృజనాత్మకతతో కూడిన ఆలోచనలు సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వం సేవలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్స్, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చేవూరులో కొనసాగుతున్న ఆందోళనలు

- పాత ముంపు ముంపుగుబోదెను తవ్వి ముంపు సమస్య పరిష్కరించాలి
- వైఎస్ఆర్ కాలనీ సమావేశానికి రానంటున్న తహశీల్దార్
- తహసీల్దార్‌కు, ఎస్ఐకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని చేవూరు గ్రామంలో వైఎస్ఆర్ కాలనీలో పాత మురుగుబోదెను పునరుద్ధరించి ముంపు సమస్య పరిష్కరించాలని ఇవ్వాలని ఆ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. చేవూరులో వైఎస్ఆర్ కాలనీలో ముంపు సమస్య పరిష్కారానికి గురువారం తహశీల్దార్ సమావేశం ఏర్పాటు చేశారు. దీంతో ఉదయం విఆర్ఒ కాలనీవాసులకు, రైతులకు విఆర్ఒ కార్యాలయం వద్ద జరుగుతున్న సమావేశానికి రావాలని సమాచారం ఇచ్చారు. అయితే కాలనీవాసులు సమస్య ఉన్న చోటకే తహశీల్దార్ వచ్చి సమస్య పరిష్కరించాలని తహశీల్దార్ కాలనీ వద్దకు రావాలని కోరారు. తహశీల్దార్ లతీఫ్ పాషా వైఎస్ఆర్ కాలనీలో వాసన వస్తుంది... నేను అక్కడికి రాను.. విఆర్ఒ కార్యాలయంలోనే ఉంటాను. వైఎస్ఆర్ కాలనీ వాళ్లు అక్కడికే రావాలంటూ తహశీల్దార్ హుకుం జారీ చేయడం గమనార్హం. అయితే కాలనీవాసులు విఆర్ఒ కార్యాలయం వద్దకు వెళ్లలేదు. దీంతో లతీఫ్ పాషా ముదినేపల్లి వెళ్లిపోయారు. దీంతో రైతులకు కాలనీవాసులకు జరగాల్సిన సమావేశం నిలిచిపోయింది. చేవూరు గ్రామంలో వైఎస్ఆర్ కాలనీలో అనుమతులు లేకుండా 30 ఎకరాల్లో చేపల చెరువులు తవ్వకాలు చేశారు. చేపల చెరువులు తవ్వే సమయంలో చెరువుల్లోని ఊట, వర్షపు నీరు, కాలనీవాసుల మురుగు నీరు వెళ్లేలా వేరే మార్గం నుంచి కొత్త బోదెను రైతులు ఏర్పాటు చేశారు. పేదలపై కక్షపూరితంగా ఒక పెత్తందారి ఇటీవల ఈ బోదెలో అడ్డుకట్ట వేయడం... దీనికి తోడు ఇటీవల భారీ వర్షాలు కురవడంతో


అడ్డుకట్టలను తొలగించాలని రైతులు, మహిళల ఆందోళన

పారుదలలేక మురికి బోదెలో నీరు వైఎస్ఆర్ కాలనీలో ఉన్న నివాసాల్లోకి ప్రవేశించాయి. దీంతో నివసించడం పేదలకు కష్టతరంగా మారిందని సమస్యను పరిష్కరించాలని గత మంగళవారం నుంచి వైఎస్ఆర్ కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్న పట్టించుకునే వారు కరువయ్యారు.

పోరాటానికి అండగా ఉంటాం.

వైఎస్ఆర్ కాలనీ ప్రాంతవాసులు చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని, ఈ చెరువులు తవ్వడం వల్ల వైఎస్ఆర్ కాలనీ ప్రాంతవాసులు ఇళ్లు, రోడ్లు మునిగిపోయి అనేక ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవ అన్నారు. కాలనీ వాసులు చేస్తున్న ఆందోళన విషయం


గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాలనీవాసులు

తెలుసుకున్న వ్యవసాయ కార్మిక సంఘం వైఎస్ఆర్ కాలనీవాసులకు సంఘీభావం తెలిపారు.

అధికారులకు వ్యతిరేకంగా ర్యాలీ

తహశీల్దార్, ఎస్ఐకు వ్యతిరేకంగా గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కాలనీ వాసులు ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. చేవూరు గ్రామంలో ఎస్‌సి కాలనీవాసులకు న్యాయం చేయాలని, తహశీల్దార్‌ను, ఎస్ఐను సస్పెండ్ చేయాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

కొత్త బోదెలో వేసిన అడ్డుకట్టను తొలగించాలని ఆందోళన

మరోవైపు గ్రామ రైతులు కొత్త బోదెలో వేసిన అడ్డుకట్టను తొలగించాలని ఆందోళన చేశారు. కొత్త బోదెలో మరో పెత్తందారి అడ్డుకట్ట వేశారని, ఆ అడ్డుకట్టను అధికారులు వెంటనే తొలగిస్తే కాలనీవాసులకు, రైతుల ఇళ్లల్లోకి ముంపు నీరు రాదన్నారు. ఓ రైతు ముందుగా వేసిన అడ్డుకట్టను తొలగిస్తే ముంపు సమస్య ఉందన్నారు. మరో రైతు రెండో అడ్డుకట్ట వేయడంతో రైతుల ఇళ్లలోకి వర్షపు నీరు వస్తుందన్నారు. బోదెలో వేసిన రెండు అడ్డుకట్టలను తొలగించాలని కోరుతున్నారు.

ఆయిల్ పామ్ రైతులకు

వారంలో సొమ్ము చెల్లించాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఆయిల్ పామ్ రైతులు గెలలు తోలిన వారంలో సొమ్ములు చెల్లించాలని, కాటాల వద్ద గెలలు ఏరివేత ఆపాలని ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం దర్భగూడెం గ్రామంలో పర్యటించి ఆయిల్ పామ్ తోటల్లో గెలలను పరిశీలించి రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు సిరి బత్తుల సీతారామయ్య, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, మండల అధ్యక్షులు దాసరి జానకీరామరెడ్డి మాట్లాడారు. రైతులు పామాయిల్ గెలలు తోలిన 15 రోజులు వరకూ వారికి సొమ్ము చెల్లించడం లేదని ఫలితంగా రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. నవభారత్ ఫ్యాక్టరీ పరిధిలో గెలలు తోలిన మరుసటి రోజు పేమెంట్ చెల్లించాలంటే టన్నుకు వంద రూపాయలు వసూలు చేయడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యాన శాఖ జోక్యం చేసుకుని అన్ని


పామాయిల్ గెలలను పరిశీలిస్తున్న నేతలు

ఫ్యాక్టరీల పరిధిలో వారం రోజుల్లోపు రైతులకు సొమ్ము చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. రైతులు తెచ్చిన పామాయిల్ గెలలు పచ్చి గెలల పేరుతో కాటాల వద్ద అన్ని ఫ్యాక్టరీలో యాజమాన్యాలు గెలలు ఏరి వేయడం ఆపాలని కోరారు. ఈ నెల 30, 31 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో జరుగుతున్న రైతు సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సిరిబత్తుల సీతారామయ్య, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి కార్పొరేషన్ బకాయిలు కట్టాలి : జిల్లా ఇడి ముక్కంటి

చింతలపూడి : ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా లోన్ తీసుకున్నవారు బకాయిలు కట్టాలని జిల్లా ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ముక్కంటి అన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా వివిధ విభాగాల్లో రుణాలు తీసుకుని బకాయిలు చెల్లించనివారితో, అధికారులతో ఆయన స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015-16, 2016-17, 2017-18 సంవత్సరాల్లో ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా జిల్లాలో 581 మందికి రుణాలు ఇచ్చినట్లు చెప్పారు. రూ.15.23 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ ఎమ్‌డి, ఇసి ఆదేశాల మేరకు అన్ని ఎస్‌సి కార్పొరేషన్‌లకు టార్గెట్లు ఇచ్చినట్లు చెప్పారు. అందులో భాగంగా జిల్లాకు టార్గెట్ కేటాయించారని, ప్రతి నెలా రూ.63.46 లక్షలు టార్గెట్ వసూలు చేయాలని తెలిపారు. అందులో భాగంగా చింతలపూడి మండలంలో 13 కార్లకు రూ.83.16 లక్షల బకాయిలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. అలాగే సెల్ఫ్ ఎంప్లాయి స్కీమ్ కింద 38 మందికి ఇచ్చారని, రూ.51.98 లక్షలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ బకాయిలు కడితే కొత్తవారికి ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా లోన్ ఇవ్వడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. తహశీల్దార్, ఎంపిడిఒ నగర పంచాయతీ కమిషనర్ ద్వారా ఎస్‌సి కార్పొరేషన్ లోన్లు తీసుకున్న వారిని కార్యాలయానికి పిలిపించి వారి ద్వారా డిక్లరేషన్ తీసుకుని ఎన్ని వాయిదాల ద్వారా కడతారో వారి వద్ద నుంచి తీసుకున్నట్లు తెలిపారు.

మిగులు భూములు సాగు చేసే పేదలకు పట్టాలివ్వాలి

వ్యకాస జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అల్లంచర్ల రాజుపాలెంలో మిగులు భూములు సాగు చేస్తున్న పేదలందరికీ పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి గుడెల్లి వెంకట్రావుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని అల్లంచర్ల అటవీ ప్రాంతంలో సర్వే నెంబర్ 226లో ఎంతో కాలంగా రెవెన్యూ, అటవీ శాఖకు చెందని ప్రభుత్వ భూమి సుమారు 1,500 ఎకరాలు ఉందన్నారు. అందులో కొందరు స్థానికంగా ఉంటున్న పేదలు సాగు చేపట్టారని అధికారులు పేదలను అడ్డుకోవడం తగదన్నారు. వెంటనే ఆ భూములకు పట్టాలు మంజూరు చేయాలని, అర్హులైన పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.

12,345 ఇళ్లను గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల చివరినాటికి మూడు లక్షల ఇళ్లను సామూహిక గృహ ప్రవేశాలకు సన్నాహాలు చేస్తుందని, జిల్లాలో 12,345 ఇళ్లను గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లాలో గృహ నిర్మాణాల ప్రగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన గురువారం సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు 12,345 టార్గెట్ కాగా 10,565 పూర్తి చేసి ఇంకా 1,780 ఇళ్లను పూర్తి చేయకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. మండలాల వారీగా సంబంధిత అధికారులతో సమీక్షించారు. బాగా వెనుకబడిన మండలాల డిఇ, ఎఇ, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, మండల ఇన్‌ఛార్జ్‌లతో టార్గెట్ వెనుకబడడం గురించి కారణాలను చెప్పమని కలెక్టర్ నిలదీశారు. వారం రోజుల్లో 403 ఇళ్లను పూర్తి చేసి మిగిలిన ఇళ్లను ఈ నెల చివరినాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశానికి హాజరు కాని ఐదుగురు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ జి.సత్యనారాయణను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల చివరినాటికి మూడు లక్షల ఇళ్లను సామూహిక గృహ ప్రవేశాలకు సన్నాహాలు చేస్తుందని, జిల్లాలో 12,345 ఇళ్లను గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. జిల్లాలో గృహ నిర్మాణాల లక్ష్యసాధనలో అధికారులు కలిసికట్టుగా పనిచేసి మంచి ప్రగతిని సాధించాలని, లక్ష్య సాధనలో వెనుకబడిన అధికారులు, సహాయకులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నెల 18వ తేదీ హౌసింగ్ డే (పేరిట) రోజున లబ్ధిదారులతో అవగాహన సదస్సులు నిర్వహించాలని, రెండు సదస్సులకు హాజరవుతానని తెలిపారు. గృహ నిర్మాణాల్లో అలసత్వం వహించే కాంట్రాక్టర్లను తొలగించి అవసరమైతే కొత్తవారిని నియమించుకుని పనులు వేగవంతం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి, ఈ నెల చివరినాటికి నూటికి నూరుశాతం ఇళ్లను పూర్తి చేసి పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ పీడీ జి.సత్యనారాయణ, డిఇలు, ఏఇలు, సహాయ ఇంజినీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మండల ఇన్‌ఛార్జులు, జిల్లా గృహ నిర్మాణ శాఖ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, అగ్నిమాపక కేంద్రం ప్రతినిధులు

బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థులు రానున్న దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్ ఆకాంక్షించారు. పాఠశాలలో గురువారం భీమడోలు అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో దీపావళి పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్రం ప్రతినిధులు టపాసులు బాణసంచా కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భీమడోలు అగ్నిమాపక కేంద్రం ప్రతినిధి వి.రవికుమార్ పాల్గొన్నారు.

క్రీడాదుస్తులు బహూకరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని అన్నవరం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సీనియర్ తెలుగు ఉపాధ్యాయురాలు శ్రీమంగలక్ష్మి క్రీడాకారుల కోసం రూ.ఐదు వేల విలువైన క్రీడాదుస్తులను బహుకరించారని పాఠశాల హెచ్‌ఎం విజయకుమారి తెలిపారు. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నూజివీడు మండలంలో జరిగిన సెలక్షన్స్‌లో 12 మంది ఎంపికయ్యారని తెలిపారు. శ్రీమంగలక్ష్మిని హెచ్‌ఎం అభినందించారు. ఉపాధ్యాయురాలు శ్రీ మంగలక్ష్మి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని తెలిపారు. తాను ఈ స్కూల్‌లో పనిచేసేనంతవరకు విద్యార్థుల కోసం తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేంద్రరావు, నాగరాజు, దుర్గామల్లేశ్వరరావు, ఫిలోమిన, జయకుమారి, జాస్మిన్, వెంకటరమణ, బివివిఎస్‌వి.ప్రసాద్, రాజేంద్రప్రసాద్, కృష్ణకుమారి, వ్యాయామ ఉపాధ్యాయుడు రవీంద్ర పాల్గొన్నారు.

ఆర్‌జియుకెటి నూజివీడులో మ్యూజిక్ వర్క్‌షాపు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి గురువారం సాధన వర్క్‌షాపు సంగీత ఉపన్యాసం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ప్రఖ్యాత గాత్ర విద్వాంసురాలు సంగీత సుధానిధి వి.లలితాచంద్రశేఖర్‌చే సంగీతంలో సంగీత ఉపన్యాసం చేశారు. అనంతరం రెండో విడతలో 5.30 నుంచి 7.30 వరకు సంగీత కచేరి చేస్తూ కచేరి పద్ధతిపై సోదాహరణ ప్రసంగం చేశారు. వీరికి సహకారంగా జె.చంద్రమౌళివయోలిన్‌తో, మృదంగంపై మంగళగిరి శ్రీధర్ సహకరించారు. లలిత విద్యార్థులకు దీక్షితార్ నోటు స్వరం నేర్పించారు.

23 మందికి ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ కళ్యాణ్ చక్రవర్తి అధికార పర్యటనలో భాగంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న 23 మందికి ప్రతిభా పురస్కారాలు అందించారు. జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమర్తి సురేష్‌బాబు, సెక్రటరీ సంధ్యా ప్రవళిక ఆధ్వర్యంలో క్లబ్ నెంబర్స్ సమక్షంలో జిల్లా గవర్నర్ కళ్యాణ్ చక్రవర్తి చేతుల మీదగా ట్రాఫిక్ పోలీస్ నరసింహారావుకు, ఫైర్ ఆఫీసర్ అబ్రహంకి,, పోస్టల్ డిపార్ట్‌మెంట్ వెంకటేశ్వరరావుకు, శానిటరీ, ఆశా, అంగన్వాడీ వర్కర్లకు, ఇలా వివిధ రంగాల్లో రాణిస్తున్న, సేవలందిస్తున్న 23 మందిని ఎంపిక చేసి గోల్డెన్ డైమండ్ వారి సౌజన్యంతో శాలువాలు కప్పి పూలదండలు వేసి సర్టిఫికెట్లు అందించి మెమెంటోలతో సత్కరించారు. పాలపర్తి శ్రీనివాస్, సోమశేఖర్, సీతారామారావు, హరిబాబు ఆర్థిక సాయం అందించారు.

నేడు జిల్లా సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్య, ఉపాధి రంగాల సంక్షోభం - విద్యార్థి, యువకుల ఆత్మహత్యలు" అంశంపై ఈనెల 17వ తేదీ శుక్రవారం జరిగే పిడిఎస్‌ఒ, ఎన్‌వైఎస్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ గురువారం ఏలూరు నగరంలోని ప్రభుత్వ, ప్రయివేట్ ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌ఒ రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీ శుక్రవారం నగరంలోని కొత్త బస్టాండ్ సమీపంలోని అల్లూరు సత్యనారాయణ భవన్‌లో పిడిఎస్‌ఒ - ఎన్‌వైఎస్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో జిల్లా సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌ఒ నగర నాయకులు క్రిస్టిబాబు, హేమ, అఖిల, నిఖిల్, ఎన్‌వైఎస్ జిల్లా నాయకులు శివ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గ్యాస్ బండలు లీకై మంటలు

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి - ముసునూరు

రెండు గ్యాస్ బండలు లీకై మంటలు చెలరేగి పూరిల్లు దగ్ధమైన ఘటన ముసునూరు మండలంలోని కాట్రేనిపాడులో చోటు చేసుకుంది. రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కాట్రేనిపాడు గ్రామానికి చెందిన కలపాల ధర్మయ్య కుమారుడు కలపాల పోతురాజు తాటికింట్లో గురువారం వంట చేస్తుండగా గ్యాస్ బండ లీకై మంటలు చెలరేగాయి. ఆ ఇంట్లో ఉన్న రెండు ఫుల్ గ్యాస్ సిలిండర్లు పేలిపోయాయి. ఈ ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. ఇంటి యజమానికి సుమారు రూ..లక్ష ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరీ పీల్చుకున్నారు. సర్పంచి గద్దల సుహాసిని మోహన్‌రావు పరిశీలించి ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధి చేకూర్చాలని అధికారులను కోరారు.

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి

- దుకాణదారులు నిబంధనలు పాటించాలి
- టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలు నడిపితే చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం ఫైర్ ఆఫీసర్ జి.అబ్రహం చెప్పారు. దుకాణదారులందరూ నిబంధనలు పాటించాలని సూచించారు. టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఆయనతో ప్రజాశక్తి చిట్‌చాట్

చిట్ చాట్

ప్రశ్న : మీ పరిధిలో ఎన్ని మండలాలు ఉన్నాయి?

ఫైర్ ఆఫీసర్ : మా పరిధిలో ఏడు మండలాలు ఉన్నాయి. అవి జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం, కామవరపుకోట, పోలవరం, జీలుగుమిల్లి, గోపాలపురం మండలాలు ఉన్నాయి.

ప్రశ్న : మీ పరిధిలో బాణసంచా తయారీ కేంద్రాలు ఏమైనా ఉన్నాయా?

ఫైర్ ఆఫీసర్ : మా పరిధిలో బాణసంచా తయారీ కేంద్రాలు ఏమీ లేవు.

ప్రశ్న : మీ పరిధిలో ఈ ఏడాది తాత్కాలిక దీపావళి బాణసంచా దుకాణాలకు ఎన్ని షాపులకు అనుమతులు ఇచ్చారు?

ఫైర్ ఆఫీసర్ : ఈ ఏడాది ప్రస్తుతానికి ఏడు మండలాల్లో కలిపి 35 షాపులకు మాత్రం అనుమతులు ఇచ్చాం. ఇంకా అనుమతుల కోసం వస్తున్నారు. గతేడాది 53 షాపులకు అనుమతులు ఇచ్చాం.

ప్రశ్న : అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలు నడిపేవారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ఫైర్ ఆఫీసర్ : అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలు నడిపితే పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి వారి షాపులను సీజ్ చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : దీపావళి సందర్భంగా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏవైనా చెప్పగలరా?

ఫైర్ ఆఫీసర్ : దీపావళి ఆనంద పండుగ. అయితే ఆ ఆనందం ప్రమాదంగా మారకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు చాలా అవసరం. పిల్లలు పేలే బాణసంచా కాల్చకూడదు. పెద్దల పర్యవేక్షణలో మాత్రమే కాల్చనివ్వాలి. బాణసంచా కాల్చే ప్రదేశం ఎప్పుడూ ఓపెన్ ఏరియాలో ఉండాలి. బాటిల్స్ లేదా మూసిన కంటైనర్లలో పటాకులు పెట్టి కాల్చకూడదు.

ప్రశ్న : ప్రజలు సాధారణంగా చేసే పొరపాట్లు ఏమిటి?

ఫైర్ ఆఫీసర్ : బాణసంచా దగ్గర ఇంధనం లేదా వస్త్రాలు ఉంచడం ప్రమాదకరం. చేనేత దుస్తులు, నైలాన్ బట్టలు కాకుండా కాటన్ దుస్తులు వేసుకోవాలి. వాటికి అగ్ని తగిలినా వెంటనే ఆర్పుకోవడం సులభం.

ప్రశ్న: అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే ఏం చేయాలి?

ఫైర్ ఆఫీసర్ : భయపడకుండా వెంటనే 101కు కాల్ చేయాలి. పక్కనే నీరు లేదా ఇసుక ఉంటే మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించాలి. పెద్ద మంటలు ఉంటే వెంటనే ఆ ప్రదేశం విడిచి సురక్షిత ప్రాంతానికి వెళ్లాలి.

ప్రశ్న : చివరగా ప్రజలకు మీరిచ్చే సందేశం ఏమిటి?

ఫైర్ ఆఫీసర్ : బాణసంచా సురక్షితంగా కాల్చండి. పర్యావరణాన్ని రక్షించండి, ఇతరులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్త పడండి. సాయంత్రం ఆరు గంటల నుంచి పది గంటల లోపే దీపావళి జరుపుకోవాలి. ఈ దీపావళి అందరికీ వెలుగులు, ఆనందం నింపాలని కోరుకుంటున్నాను. ప్రజాశక్తి తరపున ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు.

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక

కనకాద్రిపురంలో తాత్కాలికంగా గోదావరి నీరు సరఫరాకు చర్యలు

ప్రజాశక్తి కథనానికి స్పందించిన అధికారులు


గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని కనకాద్రిపురం గ్రామ ప్రజల తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక తయారు చేస్తున్నట్లు తాగునీరు, పారిశుధ్య శాఖ జంగారెడ్డిగూడెం డివిజనల్ ఇంజినీర్ సురేష్, కొయ్యలగూడెం ఎఇ మురళీకృష్ణ తెలిపారు. గ్రామంలో తాగునీటి వనరులను గురువారం స్వయంగా పరిశీలించారు. కొన్ని నెలలుగా గ్రామానికి వస్తున్న మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు అధికారులు గ్రామస్తులకు తెలిపారు. ఈ మేరకు గ్రామ కార్యదర్శి యు.గంగాధర్, గ్రామస్తులతో పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం తాగునీరు సరఫరా చేసే బోరు ప్రదేశంలో భూగర్భజలాలు అడుగంటడం, ఆరు కిలోమీటర్ల దూరం కావడం సమస్యకు కారణంగా గుర్తించామన్నారు. కొత్త బోరు నిర్మించటానికి అనువైన ప్రదేశం కోసం అన్వేషిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రెండు ప్రదేశాలు పరిశీలించినట్లు వివరించారు. ఒక రైతు స్థలం ఇవ్వటానికి ముందుకొచ్చారని, అయితే ఆ రైతు పంచాయతీకి స్థలం రాసిచ్చే ప్రక్రియ ఆలస్యమైందన్నారు. పరిశీలనలో ఉన్న మరో ప్రభుత్వ స్థలం అనుమతులు పొందాల్సి ఉందని చెప్పారు. ఇందుకు సంబంధించిన బోరు ప్రయివేట్ సంస్థ వారు వేయటానికి ముందుకొచ్చినప్పటికీ అది ఆలస్యం అవుతున్న దృష్ట్యా జల జీవన్ మిషన్ పథకంలో నూతన బోరు నిర్మిస్తామని చెప్పారు. నూతన పైపులైన్ కూడా నిర్మిస్తామని వివరించారు. ఈ లోపు మురుగు నీరు వచ్చే లైన్ నిలుపుదల చేయాలని గ్రామ కార్యదర్శికి సూచించారు. అంతేకాకుండా తాగునీటి ట్యాంక్ పరిసరాలు వెంటనే శుభ్ర పరచాలని ఆదేశించారు. ట్యాంక్‌ను శుభ్రపరిచి సత్యసాయి గోదావరి నీరు ట్యాంక్‌కు ఎక్కించి ప్రజలకు సరఫరా చేయాలని సూచించారు. బోరు సమస్య తీరేవరకు గోదావరి నీటిని ప్రజలకు అందించాలన్నారు. శుక్రవారం నుంచి శుభ్రమైన నీరు ప్రజలకు అందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సతీష్, గ్రామ కార్యదర్శి యు.గంగాధర్, గ్రామస్తులు తెక్కిన తిరుపతిరావు, ఆకుల వెంకటేశ్వరావు, దుగ్గిరాల పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు కళాధర్‌కు సత్కారం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయులుగా పనిచేసి విశిష్టమైన సేవలందించిన కళాధర్ మాస్టార్ గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ఆయనను చెక్కపలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం షేక్ అల్లాభక్షు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు రాంబాబు మాస్టార్ మాట్లాడుతూ కళాధర్ బదిలీపై వెళ్లడం బాధాకరంగా ఉందన్నారు. అలాగే నూతన డిఎస్‌సి ద్వారా పాఠశాలకు వచ్చిన ఆరుగురు ఉపాధ్యాయులకు ఘనంగా ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో జి.పద్మకిషోర్, శివ నాగమణి, రాంబాబు, అబ్రహం, మురళీకృష్ణ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

'మేరా యువభారత్'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - భీమడోలు

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న మేరా యువభారత్ కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని భీమడోలు శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రధాన ఆచార్యులు బొమ్ము రవికుమార్ కోరారు. భీమడోలు బ్లాక్ స్థాయిలో భీమడోలు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ, జూనియర్ కళాశాల వేదికగా క్లస్టర్ క్రీడా పోటీలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలురకు వాలీబాల్, కబడ్డీ ఆటల పోటీలు, బాలికలకు అథ్లెటిక్స్ విభాగంలో రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలు, బహుమతులను కళాశాల యాజమాన్యం అందించింది.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ప్రజాశక్తి - ముసునూరు

ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వెటర్నరీ డాక్టర్ చైతన్య, వెటర్నరీ అసిస్టెంట్ తానంకి రవి అక్కిరెడ్డిగూడెం గ్రామంలో సర్పంచి పులిబల్ల లక్ష్మీసత్యనారాయణ, పార్టీ గ్రామ అధ్యక్షులు బర్మా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం వేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కడియం గోపాలస్వామి, బొప్పుడి భీమశంకరావు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

బోనస్ ఇవ్వాలని ధర్నా, ర్యాలీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

2024-25కు సంబంధించిన బోనస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వంగూరు గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ వద్ద గురువారం ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. మేనేజ్‌మెంట్ ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే బోనస్ చెల్లించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ధర్నాలో ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు (యు.వి), జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ బోనస్ ఇవ్వకపోతే లేబర్ అధికారులకు రిపోర్ట్ చేస్తామని, ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మేనేజ్‌మెంట్ ప్రతినిధులు నాగరాజు, షేక్ దురానీ మాట్లాడుతూ దీపావళి ముందే బోనస్ ఇచ్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

నకిలీ ప్రకటనల పట్ల అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న సిఐ క్రాంతికుమార్


ప్రజాశక్తి - చింతలపూడి

లోన్లు, ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వచ్చే నకిలీ ప్రకటనలు, కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని చింతలపూడి సిఐ క్రాంతికుమార్ తెలిపారు. సిఐ క్రాంతికుమార్, ఎస్ఐ సతీష్ మండలంలోని ఊట సముద్రం గ్రామంలో పోలీస్ ఆధ్వర్యంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సైబర్, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నివారణపై కీలక సూచనలు చేశారు. గ్రామాల్లో ప్రజలు ఎటువంటి గొడవలు లేకుండా సామరస్యంగా ప్రజా జీవితాన్ని కొనసాగించాలని కోరారు. చిన్న చిన్న సమస్యలను గ్రామస్థాయిలోనే వెంటనే పరిష్కరించుకోవాలని, పరిష్కారానికి అనువుగా లేని తీవ్రమైన విషయాలను పోలీస్ వారి దృష్టికి తీసుకొస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా మాధ్యమాలను ప్రతి ఒక్కరూ విరివిగా వినియోగిస్తున్నారని, దీన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్ల ప్రజలను మోసగిస్తున్నారని హెచ్చరించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే, ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ నేరాల హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి ఫోన్ చేయాలన్నారు. రానున్న దీపావళి పండుగ నేపథ్యంలో ఎవరైనా బాణసంచా అక్రమంగా తయారు చేసినా, నిల్వ చేసినా సమాచారం అందించాలని కోరారు.

సహకార రంగంతోనే ఆర్థిక అంతరాల తగ్గింపు

ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ డైరెక్టర్ ఆచార్య అంజయ్య

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



మాట్లాడుతున్న అంజయ్య

సహకార రంగంతోనే ఆర్థిక అంతరాల తగ్గింపు సాధ్యమని ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ డైరెక్టర్ ఆచార్య నన్నపనేని అంజయ్య తెలిపారు. 2025 ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా సహకార వ్యవస్థ ప్రాధాన్యత, లక్ష్యాలు వివరించడానికి ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ ఏలూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక కాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపంలో సహకార సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద బ్యాంకుగా ఆవిర్భవించిన ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, పేద, మధ్య తరగతి ప్రజలకు ఎక్కువ సేవలు చేయాలని ఆశిస్తుందన్నారు. జిల్లా సహకార అధికారి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ సహకార సంవత్సరంలో లక్ష్య సాధనకు క్షేత్రస్థాయిలో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ కృషి అభినందనీయమన్నారు. విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ బ్యాంకు ఆర్థిక కార్యకలాపాలే కాకుండా సభ్యుల సంక్షేమం కోసం ఆరోగ్య బీమా, ప్రతిభా పురస్కారాలు, సభ్యుల సంక్షేమ నిధి, ఆర్థిక చేయూత వంటి సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార ఉప అధికారి ఎ.వెంకటేశ్వరరావు, బ్యాంక్ జోనల్ మేనేజర్ ఠాగూర్, ఏలూరు బ్రాంచ్ మేనేజర్ కె.కొండబాబు పాల్గొన్నారు.

జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ విజేతలకు సన్మానం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్


కోచ్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

జాతీయ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్-2025 పోటీల్లో తమ విద్యార్థులు విజేతలుగా నిలిచారని నూజివీడులోని లక్ష్మీ కల్చరల్ అకాడమీ డైరెక్టర్ ఆర్.లక్ష్మణ్ తెలిపారు. ఇటీవల ఏలూరులో జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్-2025 (బడేటి కప్) పోటీల్లో విజేతలుగా నిలిచి బహుమతులు సాధించిన ఏడుగురు విద్యార్థులకు అభినందన సభ ఘనంగా నిర్వహించారు. నూజివీడు రాజీవ్ సర్కిల్ సమీపంలోని లక్ష్మీ అకాడమీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన టి.ఆకాంక్ష, బి.పునీత్, ఆద్య కార్తీక, మను సాత్విక్, షర్లిన్, నవ్య శ్రీ, టి.అమన్‌లను, కరాటే కోచ్ మణికంఠను విజేతల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ రాజు, విజేతల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలు

ప్రజాశక్తి - ముసునూరు

నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఎపి రైతు సంఘం నాయకులు బుడుపుల జయశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగిపోయాయన్నారు. ఉపాధి హామీలో కూడా అతి తక్కువ వేతనాలతో అరకొర పని దొరుకుతుందన్నారు. నిత్యావసరా ధరలు తగ్గించాలని, ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూలీలు, ఇతర కార్మిక సంఘాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనాలపై తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వాహనాలు కొనుగోలు చేసేవారు వాహనాలపై జిఎస్‌టి తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు సూచించారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో జీలుగుమిల్లి జాతీయ రహదారిపై పలు వాహనాలతో గురువారం నిర్వహించిన అవగాహనా ర్యాలీని ఎంఎల్‌ఎ ప్రారంభించారు.

నూజివీడు టౌన్ : పట్టణంలో సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ నినాదంతో రవాణా శాఖ ఆధ్వర్యంలో నూజివీడు బస్టాండ్ నుంచి చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వరకు వంద వాహనాలతో కొత్త కార్లు, ఆటోలతో గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. నూజివీడు రవాణా శాఖాధికారులు బాలేంద్ర శేఖర్, కృష్ణవేణి ఆధ్వర్యంలో నూజివీడు మున్సిపల్ చైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ ర్యాలీని ప్రారంభించారు. నూజివీడు రవాణా శాఖాధికారి బాలేంద్ర శేఖర్ మాట్లాడారు.

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీలో మార్కెట్ యార్డ్ వద్ద ద్విచక్ర వాహనాలు, ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ వెహికల్ మోటార్ ఇన్‌స్పెక్టర్ ఎమ్‌డి జమీర్, అన్నపూర్ణ, టిడిపి పట్టణ అధ్యక్షులు అప్పారావు మాట్లాడారు.

నాణ్యమైన గోనెసంచులు ఇవ్వాలి

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలో ధాన్యం సేకరణ కార్యక్రమం త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ధాన్యం సేకరణ కేంద్రాలకు నాణ్యమైన గోనె సంచుల సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలని తహశీల్దార్ బి.రమాదేవి కోరారు. భీమడోలులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం తహశీల్దార్ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ ముందస్తు కార్యక్రమం సందర్భంగా సమీక్ష, అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు.